క్లుప్తంగా

సన్మానం



భూపాలపల్లి అర్బన్: నూతనంగా సింగరేణి డైరెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించి ఏరియా పర్యటనకు వచ్చిన శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డిలను గుర్తింపు సంఘం నాయకులు బుధవారం సన్మానించారు. జీఎం కార్యాలయంలో ఆపరేషన్ డైరెక్టర్ ఎస్ వీ కే శ్రీనివాస్, ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి లను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ సభ్యులు రత్నం సమ్మిరెడ్డి, అధికార ప్రతినిధి దేవరకొండ మధు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణానికి ఏర్పాట్లు



వాజేడు: మండల పరిధిలోని జంగాలపల్లి గ్రామంలో ఈ నెల 18 నుంచి నిర్వహించనున్న శివపార్వతుల కల్యాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం పార్వతీసమేత ఉమా రామలింగేశ్వర స్వామి ఉత్సవ కమిటీ వారు శంకుస్థాపన గుంజను నాటారు. అనంతరం భక్తుల కోసం చలువాకు పందిళ్ల వేయడానికి, స్వామి వారి కల్యాణం నిర్వహించడాని మండపం నిర్మాణం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

పరామర్శ



ములుగు రూరల్(గోవిందరావుపేట): గోవిందరావుపేట మండలం పస్రా గ్రామానికి చెందిన మసిక శుభాష్ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ములుగు, భూపాలపల్లి జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమామహ్మద్ బుధవారం పరామర్శించి సర్వర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఆమె వెంట ట్రస్టు సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

చేయూత



వాజేడు: మండల పరిధిలోని టేకులపల్లి గ్రామంలోని దివ్యాంగుడికి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం కూరగాయలను పంపిణీ చేసి చేయూతనందించారు. అంతకుముందు పాఠశాలలో కాఫెడ్ స్వచ్ఛద సంస్థ ఆధ్వర్యంలో నాయకత్వ లక్షణాలు అనే అంశంపై విద్యార్థులకు సంస్థ నిర్వాహకులు అవగాహన కల్పించారు.

పాఠశాలలను పట్టించుకోని అధికారులు



కన్నాయిగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని పాఠశాలలను విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని జెడ్పీటీసీ కరణ్‌చంద్ గాంధీ వాపోయారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ జనగాం సమ్మక్క అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ మాట్లాడుతూ.. మండలంలో విద్యావ్యవస్థ పూర్తిగా వెనుకబడిపోయిందన్నారు. పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. విద్యార్థులకు సిలబస్ పూర్తి కాలేదని తెలిపారు. పరీక్షలు సమీపిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఎంపీపీ సమ్మక్క మాట్లాడుతూ.. మండలంలో మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు ఇస్తున్న తాగునీరు వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. కాగితాలకు తప్ప నీరు ఎక్కడ లేవన్నారు. వివిధ శాఖల అధికారులు సమాచారం లేకుండా గైర్హాజరు అయ్యారని వారిపై చర్య తీసుకోవాలని ఎంపీడీఓ ఫణిచంద్రకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రామకృష్ణ, వైస్‌ఎంపీపీ భాస్కర్, ఎంపీటీసీ చిట్యాల శైలజ తదితరులు పాల్గొన్నారు.

అడవిని కాపాడడం అందరి బాధ్యత



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై అరుణ్

పలిమెల: అటవీ సంపదను కాపాడడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఎస్సై అరుణ్ అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా బుధవారం మండలంలోని బోడాయిగూడెంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై గ్రామస్తులతో మాట్లాడుతూ.. ఎవరైనా అడవిలోని చెట్లను నరికితే అటవీ సంరక్షణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే అపరిచితులకు ఆశ్రయం కల్పించవద్దని, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఉద్యోగ నియామక ప్రకటనలు వెల్లడించిన నేపథ్యంలో యువత వాటికి దరఖాస్తు చేసుకొని కష్టపడి ఉద్యోగాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సమ్మక్క–సారలమ్మ జాతర



సారలమ్మను తీసుకువస్తున్న పూజారులు



లక్ష్మీదేవరను తీసుకువస్తున్న భక్తులు

మహాముత్తారం: మండలంలోని బోర్లగూడెం గ్రామంలో సమ్మక్క–సారలమ్మ జాతరను బుధవారం వైభవంగా నిర్వహించారు. నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో గద్దెల వద్ద భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజు పూజారులు గాజరాంపల్లి నుంచి సారలమ్మను డోలీ వాయిద్యాలతో గద్దెకు తీసుకువచ్చారు. బోర్లగూడెంలోని ఎస్టీ కాలనీ నుంచి లక్ష్మీదేవరను గద్దెకు తీసుకువచ్చిన అనంతరం పూజారి అమ్మయ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గాజరాంపల్లి, పోషంపల్లి, రేగులగూడెం తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులతో నాయకులు

భూపాలపల్లి రూరల్: మహజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) వార్డు కమిటీని ఎన్నుకున్నట్లు ఆ పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మందకుమార్ మాదిగ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మందకుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ కమిటీలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో కమిటీని వేసినట్లు తెలిపారు. అధ్యక్షుడిగా సకినాల శోభన్‌బాబు రజక, ఉపాధ్యక్షుడిగా పల్లెర్ల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా పసుల కుమార్, కార్యదర్శిగా ఆలేటి కుమార్‌రజక, సహాయకార్యదర్శిగా శివరాత్రి వెంకటేశ్ వడ్డెర, బీసీ సంయుక్త కార్యదర్శిగా బండారి కార్తీక్, కోశాధికారిగా సదిరం రాజు, ప్రచార కార్యదర్శిగా పెద్ది రవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి, కన్వీనర్ గట్ల రాజన్న, జిల్లా కోకన్వీనర్ నోముల శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ భిక్షపతి, నాయకులు రాజేందర్, సురేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బట్టు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లు దగ్ధం



కాలిపోయిన ఇంటి లోపలి ప్రాంతం



దగ్ధమైన గృహోపకరణాలు

● రూ.2లక్షల ఆస్తి నష్టం

టేకుమట్ల: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు, 15 ఇళ్లలోని గృహోపకరణాలు దగ్ధమైన సంఘటన మండలంలోని ఎంపేడులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో విద్యుత్ ఓవర్‌లోడ్ వల్ల గ్రామానికి చెందిన సట్ల కొమురయ్య, బొల్లి రాజుకు చెందిన ఇళ్లు దగ్ధమైనట్లు తెలిపారు. ఇళ్లలోని గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయినట్లు సుమారు. 2లక్షల ఆస్తి నష్టం వాటినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సంఘటనపై విద్యుత్ ఏఈ మణిదీప్‌ను వివరణ కోరగా 11 కేవీ విద్యుత్ లైన్‌పై రామచిలుక విద్యుదాఘాతానికి గురి కావడంతో విద్యుత్ లైన్ తెగిపోయి ఇళ్లలోకి వెళ్లే విద్యుత్ లైన్‌పై పడింది. దీంతో 11కేవీ విద్యుత్ గ్రామంలోకి సరఫరా కావడంతో ప్రమాదం సంభవించినట్లు తెలిపారు.

అడవి నుంచి ఆలయానికి..



ఆలయానికి చేరిన నారవేప కర్ర

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ దేవాలయమైన శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయానికి ధ్వజస్తంభం కోసం అడవి నుంచి ఆలయానికి భారీ కర్రను బుధవారం తీసుకువచ్చారు. 42 ఫీట్ల పొడవు నారవేప కర్రతో ధ్వజస్తంభాన్ని నగిషీలు తయారుచేయనున్నారు. అతి త్వరలో ప్రతిష్ఠపన చేపట్టనున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మహదేవపూర్: మండలంలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించాలని మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో ఫోరం చైర్మన్ సత్యనారాయణకు జెడ్పీటీసీ గుడాల అరుణ వినతిపత్రం అందజేశారు. వ్యవసాయదారులకు పంట చేతికి వచ్చే సమయంలో కరెంటు కష్టాలు ఎదురవుతున్నాయని, కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని తెలిపారు. కరెంటు కటింగ్ లేకుండా ఇవ్వాలని కోరారు. చంద్రుపల్లి గోదావరి వద్ద ఏర్పాటు చేసిన 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌తో ఇబ్బంది పడుతున్నారని వెంటనే 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

చిట్యాల: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కృష్ణప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గిద్దెముత్తారం, అందుకుతండా గ్రామాల్లో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఏలాంటి అనుమతి పత్రాలు లేకుండా రెండు ఇసుక ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా బుధవారం పట్టుకున్నట్లు తెలిపారు. చింతకుంట రామయ్యపల్లి గ్రామానికి చెందిన చికుల నరేష్, రేగొండ మండలానికి చెందిన శంకర్‌లకు చెందిన ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించాడు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



న్యూట్రీషన్ కిట్లను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

ఏటూరునాగారం: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, సర్పంచ్ ఈసం రామ్మూర్తి అన్నారు. బాలవికాస్ సేవా సంస్థ వారి సహకారంతో మండల కేంద్రంలోని ఏడు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని 30 మంది గర్భిణులకు న్యూట్రీషన్ కిట్స్‌ను ప్రజాప్రతినిధులు పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. తల్లిపాలు బిడ్డకు దివ్య ఔషధం అన్నారు. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ ప్రేమలత, పంచాయతీ కార్యదర్శి అశోక్, బాలవికాస్ సేవా ప్రాజెక్టు మేనేజర్ మంజులరెడ్డి, వసంత, అంగన్‌వాడీ టీచర్లు సరోజ, లలితకుమారి, విజయనిర్మల, సోమలక్ష్మి, రజిని, లలిత, కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఒకరికి గాయాలు

టేకుమట్ల(రేగొండ): బస్సు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలైన సంఘటన రేగొండ మండలంలోని రూపిరెడ్డిపల్లి రామాలయం వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం కోనరావుపేట గ్రామానికి చెందిన తాటికొండ రమేశ్ పరకాలకు వెళ్లి తిరిగి కోనరావుపేటకు ఆర్టీసీ బస్సులో వెళ్తున్న క్రమంలో రూపిరెడ్డిపల్లి రామాలయం వద్ద అదుపుతప్పి కిందపడి పోయాడు. దీంతో తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం పరకాలలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

రాజగోపాలాచార్యులు మృతి



రాజగోపాలా చార్యులు(ఫైల్)

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ పూజారి తూప్రాణి రాజగోపాలాచార్యులు అనారోగ్యంతో కోటంచలోని అతని నివాసంలో బుధవారం మృతి చెందాడు. ఆయన మృతిపై ఆలయ చైర్‌పర్సన్ మాదాడి అనితాకరుణాకర్‌రెడ్డి, ఈఓ బిల్ల శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు సంతాపం ప్రకటించారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి



ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు

వాజేడు: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు అందరం కలిసి కృషి చేయాలని గుమ్మడిదొడ్డి సర్పంచ్ పాయం జయలక్ష్మి, వాజేడు వైద్యాధికారి మధుకర్ అన్నారు. మండల పరిధిలోని సుందరయ్య కాలనీ గ్రామంలో బుధవారం జాతీయ కుష్ఠు వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుష్ఠు వ్యాధి రావడానికి గల కారణాలను, వ్యాధి వలన కలిగే నష్టాలను వివరించారు. కుష్ఠు నివారణ కోసం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు.

సుందరయ్య కాలనీలో కంటి వెలుగు

మండల పరిధిలోని సుందరయ్య కాలనీ గ్రామంలో బుధవారం వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. గుమ్మడిదొడ్డి సర్పంచ్ పాయం జయలక్ష్మి, వాజేడు వైద్యాధికారి మధుకర్ సమక్షంలో గ్రామంలోని ప్రజలకు కంటి పరీక్షలను నిర్వహించారు.

12న విగ్రహ ప్రతిష్ఠాపన

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఓడవాడ సమీపంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈనెల 12 శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు అర్చకులు ఉదయచార్యులు బుధవారం తెలిపారు. ముందుగా గణపతి పూజ నిర్వహించి అనంతరం గణపతి విగ్రహం, సంతాననాగేంద్రస్వామి, ఒంటి విగ్రహాల ప్రతిష్ఠాపన కూడా అదే రోజు ఉంటుందన్నారు. ఈనెల 10 మంగళతోరణాలు, గ్రామ దేవతల ఆహ్వాన పూజలు ఉంటాయన్నారు. 11వ తేదీన మహాగణపతి పూజ, మండప పూజ, గణపతి హోమం, మూతమత్రం, విగ్రహాలకు దాన్యాదివాసం, పుష్పదివాసం ఉంటుందన్నారు. విగ్రహా ప్రతిష్ఠాపనకు భక్తులు తరలిరావాలన్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీ



సోదా చేస్తున్న పోలీసులు



ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎస్సై

వాజేడు: తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన బీరమయ్య గుట్ట సమీపంలో పేరూరు ఎస్సై రుద్రారపు హరీష్ ఆధ్వర్యంలో బుధవారం వాహన తనిఖీలను నిర్వహించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వచ్చే ప్రతీ వాహనాన్ని సోదాలు చేశారు. ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

వ్యక్తిత్వ వికాస తరగతులు ప్రారంభం



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

మహదేవపూర్: మోటివేషన్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాస తరగతులను కాటారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పెండ్యాల మమత బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుట్ట లింగమ్మ చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమం చేపట్టడం సంతోషకరమని అన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యసాధనలో తీసుకోవాల్సిన నిర్ణయాలపై ఈ శిక్షణా తరగతుల్లో అవగాహన పెంపొందుతుందని అన్నారు. ప్రత్యేక శిక్షకులు ప్రోగ్రాంలో పాల్గొని విద్యార్థుల అవసరమైన మెలకువలు నేర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా డైరెక్టర్ వెన్నంపల్లి మహేష్, బీఆర్‌ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు లింగాల రామయ్య, యూత్ అధ్యక్షుడు అలింఖాన్, సీనియర్ నాయకుడు అన్కరి ప్రకాష్, పెండ్యాల మనోహర్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ దబ్బెట రవీందర్, పట్టణ యూత్ అధ్యక్షుడు రేవెల్లి రాజశేఖర్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన వసతి కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

మహదేవపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు పుట్ట లింగమ్మ ట్రస్టు ద్వారా మధ్యాహ్న భోజనం వసతి కల్పించాలని అధ్యాపకులు, విద్యార్థులు బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీపతిబాపు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పెండ్యాల మమత మనోహర్, బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గం మహిళ ఇన్‌చార్జ్ గీతబాయి, మహిళా నాయకురాలు పద్మ, మండల ఉపాధ్యక్షుడు లింగాల రామయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ రవీందర్, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడు రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, అధ్యాపకులు సమ్మయ్య, మోహన్, సంధ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



బ్యాగులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మల్లయ్య

మహాముత్తారం: డీటీఎఫ్ యూనియన్ ఆధ్వర్యంలో మండలంలోని ములుగుపల్లి ప్రభుత్వ పాఠశాలలోని 70మంది విద్యార్థులకు సర్పంచ్ దూలం మలయ్య చేతుల మీదుగా బుధవారం బ్యాగులను పంపిణీ చేశారు. ఈ బ్యాగులను హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దంపతుల సహకారంతో కొనుగోలు చేసినట్లు డీటీఎఫ్ యూనియన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ కొండగొర్ల రవీందర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బాలరాజు, నోడల్ అధికారి అనిల్, డీటీఎఫ్ మండల అధ్యక్షుడు మోహిన్, ప్రధాన కార్యదర్శి విజయ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బోజ్యానాయక్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణరెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాల వీక్షణకు విద్యార్థులు



అసెంబ్లీ సమావేశాలను వీక్షించేందుకు వెళ్లిన విద్యార్థులు

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని సన్‌వ్యాలీ పాఠశాల విద్యార్థులు బుధవారం రాష్ట్ర శాసనసభ సమావేశాలను వీక్షించేందుకు తరలివెళ్లినట్లు పాఠశాల డైరెక్టర్లు మేనం సతీష్, మైనాల సురేష్ తెలిపారు. శాసనసభ సమావేశాల విద్యార్థులకు అవగాహన కలిగి ఉండేందుకు అసెంబ్లీ సమావేశాల తీరును ప్రత్యక్షంగా చూపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు సతీష్, సురేష్, నరేశ్, శిరుప అనిల్ ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలపై చిన్నచూపు



సమావేశంలో మాట్లాడుతున్న తాటికృష్ణ

మంగపేట: ఏజెన్సీలోని గిరిజన గ్రామాలంటే రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ ఆరోపించారు. మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు లొడె శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీస మౌలిక సదుపాయాలు లేక గొత్తికోయ గిరిజనుల ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. మండలంలోని రేగులగూడెం గొత్తికోయ గ్రామానికి నేటికి రోడ్డు, కరెంటు సౌకర్యం లేదని వాపోయాడు. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లోని గ్రామాల్లో బీటీ, సీసీ రోడ్ల సౌకర్యాలు లేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. రెండేళ్ల క్రితం ఏటూరునాగారం ఐటీడీఏ రోడ్ల అభివృద్ధి కోసం రూ 7.45 కోట్లు కేటాయించినా నేటికి రోడ్ల నిర్మాణం చేపట్టలేదన్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధికోసం కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులను అభివృద్ధిలోకి తీసుకురావడం లేదని విమర్శించారు. గిరిజనుల అభివృద్ధి బీజేపీతో సాధ్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చే విధంగా అన్ని వర్గాల ప్రజలు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లె జనార్దన్, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాకూబ్‌పాషా, మల్లూరు హేమాచల క్షేత్రం మాజీ చైర్మన్ సత్యనారాయణ, జిల్లా నాయకులు రఘు, దంతనపెల్లి నరేందర్, రతన్‌సింగ్ ఉన్నారు.

ప్రాజెక్టు కాల్వ గండి పూడ్చివేత

మంగపేట: మండలంలోని మల్లూరు వాగు మధ్యతరహా ప్రాజెక్టు కుడి కాలువకు గండిపడి నీరు వృథాగా పోతుండటంతో రైతులు ప్రొక్లెయిన్‌తో గండిని బుధవారం పూడ్చి వేయించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. ప్రాజెక్టు నుంచి సుమారు 100 మీటర్ల దూరంలో డీ01 కాలువకు గండి ఏర్పడి నీరు వృథాగా పోతున్న సంబంధిత ఇరిగేషన్ అధికారులు పట్టించుకోక పోవడంతో తామే గండిని పూడ్చినట్లు తెలిపారు. అంతే కాకుండా ప్రాజెక్టు కుడికాలువ తూము షట్టర్లను తెరిచేందుకు ఉపయోగించే నట్టును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారని అధికారులు స్పందించి మరో నట్టును ఏర్పాటు చేయాలన్నారు. కాలువల్లో పేరుకుపోయిన షిల్టును తొలిగించి కాలువకు గండ్లుపడిన చోట మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.